క్లుప్తంగా

నిష్పక్షపాతంగా పనిచేయాలి



పోలీస్‌సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కొండాపురం : ఫిర్యాదు దారునిపట్ల నమ్మకం కలిగే విధంగా నిష్పక్షపాతంగా పనిచేయాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు పోలీస్‌సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సీఐ మహ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పంట నష్టం

ముద్దనూరు : మండలంలోని నల్లబల్లె గ్రామంలో సాగుచేసిన శనగ పంట కల్తీ పురుగుమందు లపిచికారి వల్ల పంటకు నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన నల్లబల్లె గ్రామంలో దెబ్బతిన్న శనగ పంటను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 11 ఎకరాలలో సాగుచేసిన శనగపంట కల్తీ పు రుగుమందుల తోనే దెబ్బతినిందని, సంబంధించి యజమానిపై తగిన చర్యలు తీసుకుని రైతుకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం నాగలకట్టవీధిలోని శ్రీ జ్ఞానలింగేశ్వర దేవస్థానం నుంచి భక్తులు అయ్యప్పస్వామి అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరుగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలు

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దమల్లు నారయణరెడ్డి(కొండయ్య)గారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత పెద్దమల్లు లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థం శ్రీసరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. గత 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

బ్రిడ్జి పనులకు భూమిపూజ

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : పట్టణంలోని రైల్వే ఓవర్‌పుట్ బ్రిడ్జి నిర్మాణం కో సం రైల్వేశాఖ అధికారులు బుధవారం రైల్వే శా ఖ ఎస్ఈ సంజీవ కుమార్ భూమి పూజ చేశారు. రైల్వేఓవర్ పుట్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి సహకారంతో 2023లో దక్షిణ మధ్య రైల్వేశాఖాధికారులు రూ.75 లక్షలు మంజూరు చేశారు.

సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : ఈనెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లోక్ అదాలత్‌లో భాగంగా కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో కూడా ఈ అదాలత్ నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రాజీకి వీలయ్యే సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : వెనుకబడిన వైఎస్ఆర్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. కడప ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలస కూలిలుగా వెళ్లి జీవనం సాగిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు.

అపహరణకు విఫలయత్నం

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవరకోన వరదరాజులస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఆలయ హుండీ అపహరణకు విఫలయత్నం చేశారు. గతంలో కూడా హుండీని అడవిలోకి ఎత్తుకెళ్లి పగులగొట్టే ప్రయత్నం చేశారని, అది పగలకపోవడంతో అక్కడే వదిలి వెళ్లడం జరిగిందన్నారు.

ఇరువురికి గాయాలు

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రోడ్డు లో ఉన్న పెన్నా బ్రిడ్జి వద్ద పోలీస్ బైకు మరో వ్యక్తికి చెందిన బైకు ఎదురుఎదురుగా ఢీ కొన్న సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. బుధవారం పట్టణ ఎస్ఐ రామకృష్ణ ఇచ్చిన వివరాల మేరకు.. కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె.మద్దిలేటి బుధవారం రాత్రి కర్నూల్ జిల్లా చాగలమర్రి నుండి కొండాపురంకు వెళ్తుండగా పెన్నాబ్రిడ్జి వద్ద మోరగుడి గ్రామానికి చెందిన ఓబయ్య మద్యం మత్తులో కానిస్టేబుల్ బైకును ఢీ కొన్నాడు. కానిస్టేబుల్‌ను కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీలో కల్లు విక్రయిస్తున్న శాంతయ్యను బుధవారం అరెస్ట్ చేసి 54 కల్లు బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మత్తుకు బానిసవుతున్న యువత

- ఇష్టారాజ్యంగా గుట్కా ప్యాకెట్ల విక్రయాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని నిషేధిత గుట్కాలను విచ్చలవిడిగా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. దీంతో యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పిల్లల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. గుట్కా వ్యాపారాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ఇటీవల కాలంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాను ఏదోక సాకు చూపి విచ్చలవిడిగా పట్టణంలోనూ, పల్లెలోనూ విక్రయాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో చదువుకునే విద్యార్థులతోపాటు వృద్ధులు, మహిళలు



పులివెందులలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గుట్కా ప్యాకెట్లు

సైతం ఈ గుట్కాలను వేసుకుంటున్నారు. ఎక్కడైనా గుట్కా విక్రయాలు ఆలయాలకు, బడులకు 100 మీటర్లు దూరంలో ఉండాల్సి ఉంది. కానీ పులివెందుల ప్రాంతంలో గుడుల సమీపంలోనూ, బడుల సమీపంలోనే గుట్కాలు విక్రయాలు జరుపుతున్నారు. ఏవరన్నా గుట్కాలు విక్రయిస్తున్నారని అడిగితే ప్రభుత్వ అమ్ముకునేందుకు జీఓ ఇచ్చిందంటున్నారు. గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్కాలు తినడంవల్ల అనేకమంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఏ దుకాణంలో చూసిన గుట్కాలు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. గుట్కాలు తినడంవల్ల పిల్లలు మత్తుకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గుట్కాలను నిషేధించిందని ఏపీలో కూడా గుట్కాలు నిషేదిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

మత్తుకు యువత బానిస కావద్దు



ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో చాలామంది యువత మత్తుకు బానిసలవుతున్నారు. ఎక్కడ చూసినా ఇష్టారాజ్యంగా గుట్కాలు, గంజాయి దొరుకుతుండటంతో చాలామంది యువత వాటిపై దృష్టి సారిస్తూ తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు, అధికారులు యువత మత్తుకు బానిస కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలి. – విశ్వనాథనాయుడు, స్థానికుడు, పులివెందుల

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



ప్రస్తుతం చాలామంది యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. అందువల్ల తల్లిదండ్రులు పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలామంది ఎక్కడపడితే అక్కడ గుట్కాలు, సిగరెట్లు, మద్యానికి బానిసలవుతూ తమ కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. – గఫూర్, సీపీఐ నాయకులు, పులివెందుల

దర్నాను విజయవంతం చేయండి

పులివెందుల టౌన్ : ఈనెల 13వ తేదీన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ మాజీ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నా అనే పోస్టర్లను ఆవిష్కరించి విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 13న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని జిల్లాలలో కలెక్టర్ కార్యాలయాలకు రైతులతో ర్యాలీగా వెళ్లి విజ్ఞాపన పత్రం అందజేయాలన్నారు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించి రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధించాలని, రైతులపై అదనపు భారం మోపే చర్యలను కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచింది



జమ్మలమడుగులో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



ఎర్రగుంట్లలో పోస్టర్‌లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని రైతులకు ఏడాదికి రూ.20 వేలు, పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమం పూర్తిగా మరచిపోయారన్నారని ఎమ్మెల్యే రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అన్నదాతకు అండగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఏడాదికి రూ.15 వేలు, పంట నష్టం జరిగితే వారికి పరిహారం ఇచ్చి వచ్చె సీజన్‌లో తిరిగి పంటలు వేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున రాష్ట్రంలోని అన్నదాతలకు అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో మాజీ మూలే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బుధవారం పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఏకంగా ప్రజలపై ట్రూఅప్ చార్జీలపేరుతో ఏడువేల కోట్ల రూపాయల భారం మోపుతున్నారన్నారు. రైతులకు ఇవ్వవలసిన రూ.20 వేలు ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)కి శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవినొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తా రు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కొనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ 2024 పోటీలకు నందిని ఎంపిక



కమలాపురం : ఈనెల 29, 30 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్–2024 ప్రతిభాన్వేషణ పరీక్షకు కమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎస్.యోగ నందిని అర్హత సాధించిందని హెచ్‌ఎం సరస్వతి తెలిపారు. ఈనెల 6న జరిగిన జిల్లాస్థాయి కౌశల్–2024 ఆన్‌లైన్ పరీక్షలో పోస్టర్ విభాగంలో నందిని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వివరించారు. నందినిని బుధవారం హెచ్‌ఎంతో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు నాగ మునెయ్య, ఇతర ఉపాధ్యాయునులు అభినందించారు.

పీహెచ్‌సీ తనిఖీ



చౌటపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి లక్షమ నాయక్

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్షమనాయక్ తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డెంగీ, చికెన్ గున్యా పాజిటివ్ కేసులు నమోదు అయిన బుడ్డాయపల్లె, చౌటపల్లె గ్రామాలను సందర్శించారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలు తప్పని సరిగా వాడాలన్నారు. సాయంత్రం పూట ఇంటి అవరణంలో వేప ఆకుతో పోగ వేసుకోవాలని సూచించారు.

పెద్దముడియం : మండలంలోని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వ్యాధి నిరోధక టీకాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిన్నపసుపుల గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

పంటల బీమాతో రైతుకు ధీమా

కమలాపురం : పంటలు సాగు చేసుకునే రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా నమోదు చేసుకోవాలని, పంటల బీమా–రైతన్నకు ధీమా అని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని పోడదుర్తి, లేటపల్లె గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె పంటల పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి పంటలు సాగు చేసిన రైతులు స్వచ్ఛందంగా ఈనెల 15లోగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. వేరుశగన పూత దశలో ఉన్నప్పుడు 200 కిలోల జిప్సంను ఏకరాకు వేయడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వీఏఏ వికాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె, బోదేద్దులపల్లె గ్రామాల్లో నిర్వహించన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. రబీ 2024 వరి పంటకు మాత్రమే డిసెంబర్ 31 వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుటకు అవకాశం ఉందని, మిగిలిన పంటలకు మినుము, జొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, పెసర, సెనగ, వేరుశనగలకు డిసెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : జొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని బోనాల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని జొన్న పంటను పరిశీలించి మాట్లాడారు. జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు బారజైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న బుడ్డశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కొమ్మద్ది, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పంట నమోదు, బీమా చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ బీమా నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని గుర్రంపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యాన అధికారి జ్యోతిర్మయి పాల్గొని మాట్లాడారు. మామిడిలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు, మామిడిలో పంటల బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సృజనా, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. మండలంలోని కోట్లూరులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. సదస్సులో వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిచడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో పెద్దకాంపల్లె గ్రామస్తులు పాల్గొని తమ గ్రామానికి స్మశానం కొరకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. చిన్నకాంపల్లి గ్రామం సర్వే నెంబరు 206లో భూమిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామని తహసీల్దార్ తెలిపారు. గురువారం కృష్ణాపురం గ్రామానికి సంబంధించి భూమి సమస్యలపై నరసరామయ్యగారిపల్లెలోని అంగన్‌వాడీ పాఠశాల ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



వల్లూరు : కోట్లూరులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : గ్రామాలలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సరస్వతి తెలిపారు. శివాలపల్లిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలను 45 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. ఆయా సమస్యలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఇదే సదస్సులో వినతిపత్రాలు అందజేయవచ్చునన్నారు. అనంతరం రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పరిమళ, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం మార్గశిర శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు జగదీష్ శర్మ ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే రవి యోగం, భద్రావస్ యోగం కలసి రావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నంచి భక్తులు మోక్ష నారాయణ స్వామి ఆలయానికి తరలివచ్చారు. ప్రతి నెల ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా హరి హరాదులను దర్శించుకునే ఆలయం ఇదొక్కటే కావడంతో భక్తులు విరివిరిగా తరలి వచ్చారు. ఆలయ నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిత్య కళ్యాణాలు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

వల్లూరు : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ మల్లేశ్వరమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో రఘురాం మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.రైతులు ఈనెల 15వ తేదీ లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖాధికారి సాయిజ్యోతి తెలిపారు. ప్రీమియం చెల్లించడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంబవరం సర్పంచ్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. తమ గ్రామ పంచాయతీకి తాగు నీటి సరఫరా చేసే బోరు వద్దకు వెళ్లే దారి అధ్వానంగా వుందని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం అధికారులు వారి శాఖలకు సంభందించి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఇ-నామ్‌తో చీనీ రైతులకు మంచి ధర

పులివెందుల రూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ–నామ్ వ్యవస్థతో చీనీ రైతులకు మంచి ధర లభిస్తుందని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో చీనీ రైతులు, వ్యాపారులు, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ–నామ్ వ్యవస్థలో రైతులు, వ్యాపారులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని ఉంటారని, దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లలోని ధరలు చూసుకునే వీలు ఉంటుందన్నారు. పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో కూడా ఇ–నామ్ వ్యవస్థ నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఆజాద్‌వలి, ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు బి.శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దర్గా పునర్నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

పెద్దముడియం : మండలంలోని జె.కొట్టాలపల్లెలో శ్రీ దస్తగిరిస్వామి దర్గా పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన యు.హరినాథరెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు. దర్గా కమిటీ సభ్యులకు బుధవారం తల్లి ఈశ్వరమ్మ చేతుల మీదుగా అందజేశారు.

14న నీటి పారుదల సంఘాలకు ఎన్నికలు

వేముల : మండలంలోని ఆరు నీటి పారుదల సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇందిరా రాణి తెలిపారు. ఆయా టీసీల పరిధిలోని ఓటర్లు ఉదయం 9 గంటలకు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, 9 గంటలు దాటితే లోపలికి అనుమతించమన్నారు. మండలంలోని నల్లచెరువుపల్లె డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, గొల్లలగూడూరు డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, వి.కొత్తపల్లె డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. అలాగే చిన్న నీటిపారుదల సంఘాల ఎన్నికలకు సంబంధించి వేముల నీటి సంఘానికి జిల్లా ఉన్నత పాఠశాలలోనూ, వేల్పుల నీటి సంఘానికి ఎంపీయూపీ పాఠశాలలో, పెండ్లూరు చెరువుకు సంబంధించి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికలకు పోటీ చేసిన అభ్యర్థులకు ఒకరు బలపరిచే వారు, ఇద్దరు సాక్షులుగా ఉండాలన్నారు. నీటి సంఘాలకు పోటీ చేసే అభ్యర్థులతోపాటు బలపరిచేవారు కూడా 9 ఏళ్లకు ఎకరాకు రూ.120ల చొప్పున నీటి పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తానికి ఆరుశాతం వడ్డీతో ఎకరానికి రూ.1145ల చొప్పున చెల్లించాలన్నారు. ఓటింగ్‌కు వచ్చే ఓటరు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849912668 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆమె సూచించారు.

లింగాలలో..

లింగాల : పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు బుధవారం ఎన్నికల అధికారి ధర్మేంద్రకుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పెద్దకుడాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన పీఓల సమావేశాన్ని నిర్వహించి సూచనలు, సలహాలను ఇచ్చారు. పీబీసీ కెనాల్ పరిధిలో 12 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. టీసీల పరిధిలో ఉన్న గ్రామాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కామసముద్రం పరిధిలో టీసీ 1, 2, రామాపురం, బలపనూరు టీసీ 3, బలపనూరు టీసీ 4, 5, 6, 7, 9, దొండ్లవాగు టీసీ 8, మడూరు టీసీ 10, దొండ్లవాగు టీసీ 11, రాయలాపురం టీసీ 12లు ఉన్నాయన్నారు. ఈ సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆయకట్టు రైతులు రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నుకోవాలన్నారు. ఈ ఎన్నికలు ఈనెల 14వ తేదీన శనివారం పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ మధుసూదనరావు, పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో

కమలాపురం : స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఈనెల 14వ తేదీన మండల నీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పగడాల జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నీరు పారుదల వ్యవస్థకు సంబంధించి టీసీ మెంబర్లు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకునేందుకు ఓటింగ్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు నీటి పన్ను బకాయి లేదని ధృవీకరణ పత్రాన్ని రెవెన్యూ అధికారి ద్వారా తీసుకుని ఎన్నికల అధికారికి ఇవ్వాలన్నారు. ఆయకట్టుదారులందరూ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

ముద్దనూరులో

ముద్దనూరు : మండలంలోని చింతకుంట, చిన్నదుద్యాల సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ఎన్నికల అధికారులు విడుదల చేశారు. నెల 14వ తేదీన చింతకుంటలో చెరువుకు సంబంధించి 6 ప్రాదేశిక నియోజక నియోజవకర్గాల పరిధిలో మొత్తం 573 మంది ఓటర్లు వున్నారు. చిన్నదుద్యాల చెరువుకు సంబంధించిన 6 ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో మొత్తం 113 మంది ఓటర్లు వున్నారు. ఈనెల 14వ తేదీన 2 సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : మండలంలో నీటి సంఘాల ఎన్నికలలో రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదలైందని, ఈనెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సింహాద్రిపురం, కసనూరు, తొండూరు, హిమకుంట్ల, అంకాలమ్మ గూడూరు, బలపనూరు ఆరు డిస్ట్రిబ్యూటర్లకు కాను ఆయా గ్రామాలలో ఓట్లు వేయాల్సి ఉంటుందని, ఈ డిస్ట్రిబ్యూటర్ల గాను మండల వ్యాప్తంగా 2666 పురుషుల ఓట్లు, 1601 మహిళల ఓట్లు ఉన్నాయని, ఈనెల 14వ తేదీన రహస్య ఓటింగ్ ద్వారా తమ ఓట్లను వినియోగించుకోవచ్చునన్నారు.

ఎస్సీ ఉప వర్గీకరణపై సమాచారం ఏర్పాటు

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై సమాచార బోర్డులో సమాచారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో సింహాద్రిపురంలోని ఉప వర్గీకరణకు సంబంధించి సమాచార పత్రాన్ని అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ విచారణకు సంబంధించి విచారణ కమిషన్ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి సంతకంతో కూడిన రాతపూర్వకంగా సూచనలు, సలహాలను వచ్చే ఏడాది జనవరి 9లోగా అందజేయవచ్చునన్నారు. అదేవిధంగా రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ సమాచారం పంపవచ్చునన్నారు.